క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడప కార్పొరేషన్: విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా శనివారం కడప నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కడప టౌన్-2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.లక్ష్మానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ముత్రాసు పల్లి, రెడ్డి కాలనీ, పక్కీరుపల్లి, ఓంశాంతినగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్ విద్యా మందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి బార్ వీధి, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సిపి బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు, తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగన్వాడీలకు వేతనాలివ్వాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని 13 ప్రాజెక్టుల పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు వేతనాలు మంజూరు చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి కోరారు. మీడియాతో శుక్రవారం వారు మాట్లాడుతూ 14వ తేదీ వచ్చినా జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కూరగాయల బిల్లులు, గ్యాస్ బిల్లులు ఆరునెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అప్పు చేసి సెంటర్లను నిర్వహించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు వేతనాలందించి, పథకాలు వర్తింపజేయాలని కోరారు.

విద్యార్థి బ్యాంకు ఖాతాకే తల్లికి వందనం

కడప రూరల్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థి బ్యాంకు ఖాతాలకే తల్లికి వందనం నిధులు జమవుతాయని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. ఎస్సీ విద్యార్థులు సమీప పోస్టాఫీసులో బ్యాంకు ఖాతా తెరచి, మీ ఆధార్ నెంబర్‌కి ఎన్‌పీసీఐ పోర్టల్‌కు లింకు చేసుకోవాలని పేర్కొన్నారు. ఒకవేళ విద్యార్థికి ఇదివరకే బ్యాంకు ఖాతా ఉన్నట్లయితే ఆ అకౌంట్‌కు ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలని తెలిపారు. అలాగే 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలకు తల్లికి వందనం నిధులను విడుదల చేస్తారన్నారు. కావున తల్లులు తమకు ఉన్న బ్యాంక్ అకౌంట్‌కు వెంటనే ఎన్‌పీసీఐకు లింకు చేసుకోవాలన్నారు. అకౌంటు లేనివారు తమ సమీపంలోని పోస్ట్ ఆఫీస్‌లో, లేదా బ్యాంకులో ఖాతా తెరచి ఆధార్ నెంబర్‌కు ఎన్‌పీసీఐ పోర్టల్‌కు లింక్ చేసుకోవాలని తెలిపారు.

సమ్మెకు సంపూర్ణ మద్దతు

కడప కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్(సిఐటీయూ అనుబంధం) నగర అధ్యక్షుడు సుంకర రవి, సహాయ కార్యదర్శి ఇ.ప్రకాష్, డ్రైవర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్. కిరణ్ తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడుతూ సమ్మెలో పారిశుద్ధ్య, డ్రైవర్లు, అదనపు కోవిడ్ కార్మికులు, రెగ్యులర్ ఉద్యోగులు సమ్మెలో భాగస్వాములవుతారని చెప్పారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగుల డేటాలో తప్పులను సవరించాలని, ఏపీ జీఎల్ఐ బాండ్స్ ఇవ్వాలని కోరారు. వాటర్ ట్యాంకర్ డ్రైవర్లకు 36 జీవో ప్రకారం వేతనాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాద మృతులకు నివాళి



మృతులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో వందలాది మంది మృతి చెందడం బాధాకరమని జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షుడు, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వివేకానంద రెడ్డి అన్నారు. కడప ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో విద్యార్థులు విమాన ప్రమాద మృతులకు శుక్రవారం నివాళి అర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 250 మందికి పైగా విదేశీయులు, స్వదేశీయులు, చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరం అన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని, బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పునీత్, సంధ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కడప ఎడ్యుకేషన్: కడప మండలం బుడ్డాయపల్లె మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయుడు లక్ష్మీకాంత్‌ను పాఠశాల విద్యా కమిటీ, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆయన పిల్లలకు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పి.నరేంద్రనాథ్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మెన్ మల్లేశ్వరి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


● మోడువారిన మొక్కే.. మళ్లీ చిగురించె



ప్రకృతిలోని మొక్కలు, చెట్లు మనకు ఎన్నో జీవిత పాఠాలు నేర్పుతుంటాయి. ఒక చెట్టును మొదళ్ల వరకూ నరికేసినా మళ్లీ చిగురించి చెట్టు ఎదగడానికి దోహదపడుతుంది. అలాగే జీవితంలో కూడా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఆత్మస్థైర్యం కోల్పోకుండా నిబ్బరంగా నిలదొక్కుకొని ఎదగాలనే సందేశం దీనిద్వారా నేర్చుకోవచ్చు. గండి వాటర్ వర్క్సుకు వెళ్లే దారిలో ఈ దృశ్యాలు కనిపించాయి.

–సాక్షి ఫోటోగ్రాఫర్, కడప

● మర్రిచెట్టుపై.. తాటి చెట్టు



మర్రిచెట్టు నీడలో మరే చెట్టు ఎదగదంటారు పెద్దలు...కానీ ఇక్కడ మర్రిచెట్టును చీల్చుకొని దానికంటే ఎత్తుకు పెరిగిన ఈ తాటి చెట్టును చూస్తే స్ఫూర్తి కలుగక మానదు. కృషి, పట్టుదల, అంకితభావం ఉంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని ఈ వృక్షాలు నిరూపిస్తున్నాయి. మనిషి కూడా జీవితంలో ఇలాగే పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చు. సిద్దవటం మండలంలోని మాచుపల్లి సమీపంలోని బంగళా సమీపంలో అ దృశ్యాలు కనిపించాయి.

–సాక్షి ఫోటోగ్రాఫర్, కడప

బీసీలకు పెన్షన్ ఎప్పుడిస్తారో చెప్పాలి

వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్.శివరామ్



విలేకరులతో మాట్లాడుతున్న ఎన్.శివరామ్

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో 50 సంవత్సరాలకు పైబడిన బీసీలకు పింఛన్లు ఎప్పుడిస్తారో చెప్పాలని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్.శివరామ్ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కడప వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల వయస్సున్న బీసీలకు రూ.4వేల పెన్షన్ ఇస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం బీసీలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. అర్హత కలిగిన ప్రతి బీసీకి రూ.48వేలు ప్రభుత్వం ఎగనామం పెట్టిందని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీల్లో ప్రభుత్వం ఏ ఒక్క హామీ అమలుచేయకపోగా, అన్నీ చేశామని ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు, బీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు సుంకేశుల బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కడప కల్చరల్: పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన తొగటవీర క్షత్రియ కుల విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నట్లు తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షుడు కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు తెలిపారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 15న ఆదివారం ఉదయం పది గంటలకు పాత రిమ్స్‌లోని బీసీ భవన్‌లో కార్యక్రమం జరుగుతుందన్నారు. 2024–25 సంవత్సరానికి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన 59 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపిక అందజేస్తున్నామన్నారు. నగర పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు, జ్ఞాపిక బహూకరిస్తున్నామన్నారు. తొగటవీర క్షత్రియ కుల బాంధవులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లా మురళీకృష్ణయ్య, టేకూరి సుదర్శన్, చౌడంసూరి బాబు, బొలిశెట్టి వెంకటస్వామి, పల్లా బాల చౌడన్న, దొండ్ల వెంకటరమణ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రంలో పలు ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లకు ప్రభుత్వ పథకాలు వర్తించేటట్లు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని హొచిమిన్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో మూడు లక్షల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వివిధ రకాల సేవలందిస్తున్నారని తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధాప్య పింఛన్లు, ఇళ్ల స్థలాలు వర్తింపజేయడం లేదని తెలిపారు. ప్రతి నిరుపేద కుటుంబానికి రేషన్ సరుకులతో పాటు సంక్షేమ పథకాలు ఇవ్వాలని నాటి వైసీపీ ప్రభుత్వాన్ని అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు విమర్శించడాన్ని గుర్తుచేశారు. నెట్‌వర్క్ సమస్యలతో వారం మొత్తానికి కనీసం ఒక కుటుంబం కూడా లబ్ధిపొందే పరిస్థితి లేదన్నారు. తక్కువ ఆదాయం పొందుతున్న నిరుపేద కుటుంబాలు అత్యధిక స్థాయిలో ఉన్నట్టు నివేదిక చెబుతోందని తెలిపారు. ఆర్థిక మాంద్యం పెరుగుతున్న తరుణంలో, చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరి కెసి.బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి, ఉపాధ్యక్షురాలు మంజుల పాల్గొన్నారు.

ఆర్కిటెక్చర్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



దర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: కడప వైఎస్సార్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయ విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.వలరాజు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సీఓఏ పర్మిషన్ ఇప్పించాలని కోరారు. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ అనుమతి లేకపోయినా విద్యార్థులతో అడ్మిషన్లు చేయించారన్నారు. ఐదేళ్ల కాలం పూర్తయిన పది రోజుల్లో ఫైనల్ పరీక్షలు ఉన్నప్పటికీ సీఓఏ అనుమతి ఇంతవరకూ రాకపోవడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడటమేనని విమర్శించారు. వైస్ ఛాన్సలర్ విశ్వనాథ్ నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భవనాలకు అద్దె చెల్లిస్తున్నప్పటికీ వైస్ ఛాన్సలర్, కాంట్రాక్టర్‌కు మధ్య సమస్యలు రావడంతో హాస్టల్ ఖాళీ చేయాలని విద్యార్థులను ఆదేశించడం సరికాదన్నారు. టీజింగ్ ఫ్యాకల్టీని రెన్యూవల్ చేయకపోవడంతో తరగతులు బోధించే వారే కరువయ్యారన్నారు. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ అనుమతి లభించకపోతే ఐదేళ్ల డిగ్రీ చిత్తు కాగితంతో సమానమవుతోందన్నారు. విద్యాశాఖమంత్రి నారా లోకేష్ సీఓఏ అనుమతి తక్షణమే మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, యూనివర్శిటీ విద్యార్థి నాయకులు సాయికృష్ణ, రామాంజనేయులు, సుష్మ, సింధు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు లెప్రసీ అలవెన్స్ ఇస్తాం



జేసీకి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: నిధులు విడుదల కాగానే రెండు, మూడు రోజుల్లో ఆశా కార్యకర్తలకు లెప్రసీ అలవెన్స్ ఇస్తామని లెప్రసీ జిల్లా అధికారి హామీ ఇచ్చారు. కడప కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల రిలే నిరాహార దీక్షలు శుక్రవారం విరమించారు. ఈ సందర్భంగా జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ విజయలక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యాదర్శులు వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ.బాదుల్లా మాట్లాడుతూ ఆశా వర్కర్ల రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రాట్యూటీ ఇవ్వాలని, మెటర్నటీ లీవ్ అమలు చేస్తూ జీఓ జారీచేయాలని కోరారు. జీఓలు జారీ అయ్యేంత వరకు ఆశా వర్కర్లను రిటైర్‌మెంట్ ఇవ్వరాదని, ఎక్కడైనా చేస్తే జీఓ వచ్చాక మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మెరుగైన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసమ్మ, శాంతమ్మ, శోభారాణి పాల్గొన్నారు.

విధి నిర్వహణలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



డ్రైవర్లకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప కోటిరెడ్డిసర్కిల్: డ్రైవర్లు విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రమాద రహిత డ్రైవింగ్ చేయాలని కడప ట్రాఫిక్ సీఐ జావీద్ పిలుపునిచ్చారు.కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయ సభా భవనంలో ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జావీద్ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థకు ప్రమాద రహిత సంస్థగా పేరు ఉందన్నారు. బస్సు నడిపే సమయంలో అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. చిన్న పొరపాట్లే ప్రమాదాలకు కారణమవుతాయన్న విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. అనంతరం పులివెందుల డిపో మేనేజర్ రామకృష్ణ ఇంధన పొదుపుపై పంచసూత్రాలపై సలహాలు, సూచనలు చేశారు. మధ్యాహ్నం డ్రైవర్లను బ్లాక్ స్పాట్‌పై అవగాహన కల్పించారు. తొలుత ఓం శాంతి సంస్థ ప్రతినిధి ప్రదీప్ అక్కయ్య డ్రైవర్లచే ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు కృష్ణారెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

అనుమతులు లేని విద్యాసంస్థలను సీజ్ చేయాలి



దర్నా చేస్తున్న పీఎస్ఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో అనుమతులు లేకుండా నడుపుతున్న ఇంటర్మీడియట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రోగ్రెస్ స్టూడెంట్స్ ఫెడరేషన్(పి.ఎస్.ఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. కడప ఆర్ఐవో కార్యాలయం ఎదుట పీఎస్ఎఫ్ నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు చదువును వ్యాపార కేంద్రంగా మార్చుకొని విద్యార్థులకు ఎటువంటి మౌలిక వసతులు కల్పించకుండా ఫీజులు గుంజుతున్నారన్నారు. కళాశాలలకు ఆటస్థలాలు, పార్కింగ్ లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ అధికారులు అనుమతులు ఇచ్చారన్నారు. ముఖ్యంగా శ్రీ చైతన్య , నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎఫ్ నాయకులు శ్రీనాథ్, వెంకటేశ్, ప్రవీణ్, నరసింహ, హరి తదితరులు పాల్గొన్నారు.

ధరలకు అనుకూలంగా మెస్ చార్జీలు పెంచాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కడప కలెక్టరేట్ ఎదుట రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ హాస్టళ్లు ప్రారంభమవుతున్న సందర్భంగా పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలన్నారు. గత 10 నెలలుగా హాస్టళ్లకు డబ్బులు ఖర్చు పెడుతున్నారని, మెస్ చార్జీలు విడుదల కాకపోతే విద్యార్థులకు పోషక ఆహారం ఎలా అందిస్తారని ప్రశ్నించారు. ఖాళీగా ఉన్న హెచ్ డబ్ల్యూఓ, వంట మనిషి, కమాటీ, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. దీంతోపాటు విద్యార్థులకు ట్రంకుపెట్టె, ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు, పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఆర్‌ఓకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి. జిల్లా కమిటీ సభ్యుడు గురుప్రసాద్, కళ్యాణ్, ప్రమోద్, కళ్యాణ్, ప్రతాప్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలని ఆందోళన

కడప ఎడ్యుకేషన్: కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. కడప భాష్యం పాఠశాలల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ బాష్యం యాజమాన్యం విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి ఫీజులు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్, వంశీరెడ్డి, ముబారక్ భాషా, భాస్కర్, రమణ, నవీన్, కిషోర్, సుబ్రహ్మణ్యం, కార్తీక్, రామాంజులు, నాగేంద్ర, సికిందర్ పాల్గొన్నారు

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి



రైతులకు సూచనలు ఇస్తున్న ప్రవీణ్‌కుమార్

వల్లూరు : రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఎంతైనా వుందని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పెద్దపుత్త గ్రామంలో రైతులు సాగు చేసిన పీఎండీఎస్ నవధాన్య సాగును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలను సాగు చేసుకోవడం వలన అనేక లాభాలు ఉన్నాయన్నారు. దీని వలన ప్రధానంగా భూమి సారవంతంగా మారడంతోపాటుగా ప్రధాన పంటకు వచ్చే అధిక తెగుల్లను అరికట్టవచ్చునని వివరించారు. ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎన్నో ప్రయోజనాలు వున్నందున రైతులు ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాలను సాగు వేసుకోవాలని సూచించారు. వరి సాగులో ఘన జీవామృతం, ద్రవ జీవామృతంను తప్పనిసరిగా వాడుకోవాలని సూచించారు. వరిలో సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే చాలావరకు పురుగులు, తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు. రాఘవరెడ్డి, బాలిరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లు

పెండ్లిమర్రి : ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం గురించి గృహ వినియోగదారులకు అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని మిట్టమీదపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పీఎం సూర్య ఘర్ యోజన పథకం గురించి వినియోగదారులకు, సోలార్ గుత్తేదారులకు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహవినియోగదారులు ఇంటి పైకప్పుమీద సోలార్ రూఫ్ టాప్ అమర్చుకుని వినియోగించుకోవచ్చన్నారు. విటి వల్లన విద్యుత్ బిల్లు చాలా తక్కువగా వస్తుందన్నారు. పర్యావరణానికి హానిచేయని సౌర శక్తి వాడకాన్ని ప్రజలంతా అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ జయరామయ్య, జూనియర్ ఇంజనీర్లు నవనీతబాయ్, వెంకటశివ పాల్గొన్నారు.